సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 13 । మే । 2025



కుమార్తె పుట్టిన రోజున..

కుమార్తె పుట్టిన రోజునే తండ్రికి మృత్యువు ఎదురైంది. పైడిభీమవరం సమీపంలో ప్రమాదం జరిగింది. - 8లో



సమస్యల ఏకరువు

గ్రీవెన్స్‌సెల్‌లో ప్రజలు సమస్యలు ఏకరువు పెట్టారు. పలు ఫిర్యాదులు అందజేశారు. - 8లో

రిమ్స్‌లో ప్రత్యేక ఓపీ సర్వీసు

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్)లో ప్రత్యేక ఓపీ ద్వారా వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈనెల 13వ తేదీ నుంచి పచ్చ కామెర్లు, కాలేయం సంబంధిత సమస్యలు ఉన్నవారు ఓపీ తీసుకుని మెరుగైన వైద్య సేవలు పొందవచ్చు. ఇందుకుగాను డాక్టర్ ఎస్ఎస్‌వీవీ నర్సింగరావు, డాక్టర్ సతీష్ నాయుడులను రిమ్స్ అధికారులు నియమించారు. సంబంధిత వ్యాధులతో బాధపడేవారు పని దినాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు వారి పాత రికార్డులు, రిపోర్టులు, ఆధార్ కార్డు తీసుకుని రిమ్స్‌కు వచ్చి వైద్య సేవలను పొందవచ్చు.

న్యూస్‌రీల్

వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ రామ్‌జీ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో 30 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి కల్పించనున్నట్లు చెప్పారు. 18 నుంచి 45 ఏళ్ల మధ్య వారు అర్హులుగా తెలిపారు. ఉమ్మడి జిల్లా యువత అర్హులు కాగా, పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 79933 40407, 9553410809 సంప్రదించాలని అన్నారు.

సరిహద్దులో పటిష్టంగా తనిఖీలు



చెక్‌పోస్టు పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్

ఇచ్ఛాపురం టౌన్: ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో గంజాయి, మద్యం అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు పటిష్టంగా చేయాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం సరిహద్దులోని చెక్‌పోస్టును పరిశీలించారు. తనిఖీ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఒడిశా నుంచి ఆంధ్రాకు గంజాయి, మద్యం అక్రమంగా రాకుండా అన్నిమార్గాల్లో అన్ని వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. నవోదయం కార్యక్రమం ద్వారా ప్రజల్లో కలిగిస్తున్న అవగాహన కార్యక్రమాల కోసం తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి చర్యలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాలో పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పర్యాటక అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. పర్యాటక శాఖపై సోమవారం ఆయన జూమ్‌లో సమీక్షించారు. జిల్లాలో రణస్థలం మండలం, కళింగపట్నం, బారువ, భావనపాడు, తదితర బీచ్‌ల అభివృద్ధికి రిపోర్టు తయారు చేయాలని సూచించారు. కవిటి బీచ్‌లో పర్యాటకులకు అనుగుణంగా ఉన్న స్థలాన్ని గుర్తించాలని తెలిపారు. కళింగపట్నం బీచ్‌ను స్వదేశీ దర్శనం ద్వారా అభివృద్ధి చేయాలన్నారు.

నేలకూలిన పెలికాన్



వైద్య సేవలు అందిస్తున్న ఏడీ డాక్టర్ చంద్రశేఖర్

కాశీబుగ్గ: పలాస మండలం శాసనాం గ్రామ సమీప జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం తక్కువ ఎత్తులో ఎగురుతున్న సైబీరియా పెలికాన్ పక్షిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో పెలికాన్ పక్షి రెక్కకు గాయాలై పక్షి ఎగర లేకపోయింది. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ అటవీశాఖ రేంజ్ అధికారి మురళీకృష్ణ ఆదేశాల మేరకు అధికారులు ఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన పెలికాన్ పక్షిని పలాస పశు వైద్యశాలలో వైద్యం అందించారు.

సచివాలయ సిబ్బందిపై 'కూన' ఆగ్రహం

బూర్జ: సచివాలయ సిబ్బంది పనితీరు మార్చుకోవాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం బూర్జ మండలం డొంకలపర్త గ్రామ సచివాలయం సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. సచివాలయ సిబ్బంది స్టూడెంట్లు కాదని, ఇంకా విద్యార్థుల్లాగా ప్రవర్తిస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.



'మేడిపండు చూడ మేలిమై ఉండును.. పొట్ట విప్పి చూడ పురుగులుండు..' అన్నారెప్పుడో యోగి వేమన. 'కూటమి ప్రచారం చూడ మెరిసిపోవుచుండును.. గుట్టు విప్పి చూడ మేడిపండు మేలు' అనాలేమో మనమిప్పుడు. అరసవల్లి రథసప్తమికి భూమి ఆకాశం బద్దలయ్యేలా అధికార నేతలు ఆర్భాటాలు చేశారు. పైపైన పనులు చేసి ఉత్సవ ఉత్సాహం చూపించారు. కానీ ఉత్సవం ముగిశాక.. అసలు గుట్టు బయటపడింది. కూల్చివేతలపై పెట్టిన శ్రద్ధ నిర్మాణాలపై పెట్టలేకపోయారు. ప్రచారంపై చూపిన చిత్తశుద్ధి పనుల్లోని నాణ్యతపై చూపలేకపోయారు. ఫలితంగా ఆదిత్యుడి భక్తులకు అవస్థలు తప్పడం లేదు.

గోరంత పని.. కొండంత ప్రచారం

- అసంపూర్తిగా రథసప్తమి పనులు
- రథసప్తమి పేరిట కూటమి సర్కారు ఆర్భాటం
- అభివృద్ధి తక్కువ.. ప్రచారం ఎక్కువ
- అరకొరగా పనులు..అవి కూడా నాసిరకమే
- క్యూలైన్లు, అన్నదానం, ప్రసాదాల భవనాల తొలగింపు
- భక్తులకు తప్పని అవస్థలు



ఆలయం ముందున్న షెడ్లను తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)



ఎండల్లో అవస్థలు పడుతున్న భక్తులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

రథ సప్తమి ఉత్సవాలకు ప్రభుత్వ పెద్దలు చేసిన ప్రచార ఆర్భాటాలు సిక్కోలు వాసులు ఇంకా మర్చిపోలేదు. ఈ ఏడాది రథసప్తమి మహోత్సవాలను తొలిసారిగా రాష్ట్ర పండుగ అంటూ ప్రకటించారు. కానీ ప్రభుత్వం మాత్రం ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. కానీ రాష్ట్ర పండుగ అని మాత్రం ప్రకటించుకున్నారు. పనుల్లోకి దిగాక ఆలయం ముందున్న శాశ్వత భవనాలను అభివృద్ధి ముసుగులో కూల్చేశారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో రూ.100 కోట్లతో అభివృద్ధి చేసేస్తామంటూ కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌లు హడావుడి చేసి భవనాలన్నీ నేలమట్టం చేయించేశారు. కూల్చివేతల పర్వం పూర్తయ్యాక.. ఆలయానికి వచ్చే ఆదాయం పడిపోయింది. దీనికి తోడు కూల్చిన వాటి స్థానంలో కొత్తవాటి నిర్మాణం గురించి ఎవరూ మాట్లాడడం లేదు. ప్రస్తుతానికి తాత్కాలికంగా జింకు షెడ్లలోనే భక్తులకు సేవలందిస్తున్నారు. సౌకర్యాలు కల్పించకపోవడంతో ఆదిత్యుని దర్శనానికి వస్తున్న భక్తులకు కష్టాలే ఎదురవుతున్నాయి.

ప్రచార ఆర్భాటాలు..

ప్రఖ్యాత ఆలయాల సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ పర్యాటక శాఖ నుంచి పిలిగ్రిమేజ్ రెజువనేషన్ అండ్ స్పిరిట్యువల్ ఆగుమెంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) అనే పథకం వర్తించేలా అరసవల్లిని ఎంపిక చేసేశామని, త్వరలో రూ.100 కోట్ల వరకు నిధులు రానున్నాయంటూ పెద్ద ప్రచారాలు చేశారు. ఆరు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ప్రసాద్ పథకం కాదు కదా.. ప్రసాదాల భవనాలను కూడా నిర్మించలేకపోయారు. గత ఏడాది డిసెంబర్ లోనే అరసవల్లి ఆలయం ముందున్న నిర్మాణాలన్నీ కూల్చివేయనున్నామని అధికారికంగా ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రకటించేసి ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా కూల్చివేత పనులను చేపట్టారు. దీంతో గత ఆరునెలల నుంచి ఆదిత్యుడిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. అరసవల్లి ప్రధాన రహదారిని కూడా విస్తరణ చేయకుండా మధ్యలో డివైడర్లను ఏర్పాటు చేసి అరసవల్లి మిల్లు కూడలిలో మాత్రం అరసవల్లి జ్ఞాపికగా పెద్ద రథచక్రాన్ని మాత్రం ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు.

అన్నీ తాత్కాలికమే..



విగ్రహం దుస్థితి

ఆలయం ముందున్న 10 ఆలయ దుకాణ సముదాయంతో పాటు అన్నదాన తయారీ, ప్రసాదాల విభాగ భవనాలు, మరో 12 వసతి గదులు, 30 వరకు మరుగుదొడ్ల భవనాలన్నీ కూల్చేసిన సంగతి తెలిసిందే. అయితే ఇంతవరకు శాశ్వత భవనాలను నిర్మించేలా ఒక్క నిర్ణయాన్ని కూడా ఆలయ వర్గాలు గానీ ప్రభుత్వం గానీ చేపట్టలేదు. కూల్చేసిన స్థానమంతా కాంక్రీట్ ఫ్లోరింగ్ చేసేసి వదిలేశారు. ఇంద్రపుష్కరిణి చుట్టూ గోశాల, అన్నదాన షెడ్డు, జింకు షీట్లతో మరుగుదొడ్లను, అలాగే భారీ ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను మాత్రం ఏర్పాటు చేశారు. అయితే ఇవన్నీ తాత్కాలికం కావడంతో భక్తులకు అవస్థలు తప్పడం లేదు. పోనీ చేస్తున్న పనుల్లో నాణ్యత ఉందా.. అంటే నాసిరకంగానే ఉన్నాయి. ప్రసాదాల కౌంటర్లు ఇంతవరకు స్థిరంగా ఏర్పాటు చేయలేదు. అన్నదాన మండపాన్ని కూడా పుష్కరిణి ఒడ్డున షెడ్డులో ఏర్పాటు చేశారు. భక్తుల కోసం సరైన రీతిలో మౌలిక సదుపాయాలు కూడా కల్పించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



ఆలయానికి చెందిన శాశ్వత భవనాలను కూల్చేస్తున్న దృశ్యం (ఫైల్)

అరసవల్లి ఆలయాన్ని ప్రచార కేంద్రంగా మార్చేసేలా తెలుగుదేశం పార్టీ సోషల్‌మీడియా విభాగం వ్యవహరిస్తున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ఇటీవల రాష్ట్రంలో కొత్తగా 23 ఆలయాల్లో నిత్యాన్నదాన పథకాన్ని అమలు చేస్తున్నట్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అయితే అరసవల్లిలో 1996 నుంచే నిత్యాన్నదాన పథకం అమల్లో ఉంది. ఆలయంలో భక్తులిచ్చిన విరాళాలతోనే దీన్ని అమలు చేస్తూనే ఉన్నారు. అయితే ఇప్పుడేదో కొత్తగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చేయించినట్లుగా సోషల్‌మీడియాలో పోస్టింగ్‌ల ప్రచారాలకు టీడీపీ దిగడంపై భక్తులు నవ్వుకుంటున్నారు.

ఇల్లు కట్టి చూడు..!



- భూమి విలువ పెంచడంతో పెరిగిపోయిన అభివృద్ధి చార్జీలు
- ఆకాశాన్నంటుతున్న సిమెంట్, ఇనుము ధరలు
- ప్రభుత్వ ప్రకటనలకు విరుద్ధంగా ఇసుక రేటు
- నిలిచిపోతున్న భవన నిర్మాణాలు

శ్రీకాకుళం:

ఇళ్ల నిర్మాణం జిల్లా ప్రజలకు తలకు మించిన భారమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల భూముల రేట్లను పెంచడంతో ప్లాను అనుమతులకు ముందుగా చెల్లించాల్సిన ఖాళీ స్థలం పన్ను, అభివృద్ధి పన్ను అమాంతం పెరిగిపోయాయి. ఏదోలా వీటిని అధిగమిస్తే.. లైసెన్స్‌డ్ సర్వేయర్లు పరోక్షంగా పెన్‌డౌన్ ప్రకటించి ప్లానులు అప్‌లోడ్ చేసేందుకు నిరాకరిస్తుండటంతో అనుమతి సైతం పొందలేకపోతున్నారు. ఇక ఇప్పటికే నిర్మాణం ప్రారంభించిన వారికి పెరుగుతున్న సిమెంట్, ఇనుము ధరలు భయపెడుతున్నాయి. ఒక్కో సిమెంట్ బస్తాపై రూ.60 నుంచి రూ.70లు వరకు పెరిగిపోయింది. టన్ను ఇనుముపై రూ.10 వేలు వరకు రేటు పెరిగింది. ప్రభుత్వం ఇసుక సరఫరాను సులభతరం చేశామన్నప్పటికీ ఎక్కడా ప్రభుత్వం ప్రకటించిన ధరకు ఇసుక దొరకటం లేదు. ఇటుక, చిప్స్ రేట్లు కూడా పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఇళ్లు నిర్మిస్తున్న వారు ఇళ్లు నిలుపుదల చేయగా, ఇళ్ల నిర్మాణం చేపట్టాలనుకున్నవారు కూడా ఆ ఆలోచన విరమించుకునే పరిస్థితి ఏర్పడింది.



నిలిచిపోయిన అపార్టుమెంట్ నిర్మాణం

పెన్‌డౌన్‌పై సమాచారం లేదు



లైసెన్సుడు సర్వేయర్లపై పెన్‌డౌన్ చేస్తున్నట్టు సమాచారం లేదు. అలా చేస్తున్నట్టు చెబితే వారి లైసెన్సు రద్దవుతుంది. ఇళ్ల నిర్మాణదారులు నేరుగా వచ్చి కూడా మా కార్యాలయంలో ప్లాన్లను అప్‌లోడ్ చేసుకుని అనుమతులు పొందవచ్చు.

– పీవీడీ ప్రసాదరావు, కమిషనర్

సర్క్యులేషన్ ప్యాట్రన్...

పది అడుగుల లోపు రోడ్డు ఉన్న ప్రాంతాల్లో ఇంటి ముందు స్థలం వదలకుండా నిర్మాణాలు చేపట్టేందుకు రూపొందించిన సర్క్యులేషన్ ప్యాట్రన్ పేదలకు ఉపయోగలేకుండా పోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సర్క్యులేషన్ ప్యాట్రన్‌కు శ్రీకారం చుట్టారు. అప్పటి సీఎం వైఎస్‌జగన్‌ను కూడా ఒప్పించారు. ఇది జరిగి ఏడాదిన్నర కావస్తుండగా, ఇటీవల దీనికి ఆమోదం లభించింది. ఇప్పుడు లైసెన్సుడు సర్వేయర్లు ప్లాన్లు అప్‌లోడ్ చేసేందుకు నిరాకరిస్తుండగా, పెరిగిన ధరలను భరించలేక ఇళ్ల నిర్మాణాలను విరమించుకుంటున్నారు. జూన్ నుంచి వర్షాలు పడే అవకాశముండటంతో అప్పుడు ఇంటి నిర్మాణాలు చేపట్టే అవకాశం కూడా ఉండదు. ఫలితంగా భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోసం వేర్వేరు మార్గాలను ఎంచుకోవాల్సి వస్తోంది.

● పుష్ప విలాసం

జిల్లా కేంద్రంలోని నారాయణతిరుమల కొండపై వెలసి ఉన్న వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు కమనీయంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామికి పుష్ప యాగం నిర్వహించారు. తీరొక్క కుసుమాల మధ్య వెంకన్నను దర్శించుకున్న భక్తులు మురిసిపోయారు. ఈ సందర్భంగా నిర్వహించిన తిరువీధిలో కోలాటం ఆకట్టుకుంది.

– శ్రీకాకుళం కల్చరల్



ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్...

కొత్తూరు: పానుటూరు గ్రామంలోని వంశధార నది నుంచి ఒడిశాకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం స్థానిక తహసీల్దార్ కె.బాలకృష్ణ పట్టుకున్నారు. ఇక్కడ అక్రమాలపై 'దేవుడి పేరుతో దోపిడీ' పేరిట సాక్షిలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనికి తహసీల్దార్ స్పందించారు. పానుటూరు నుంచి ఒడిశాకు వెళ్తున్న రెండు ఇసుక ట్రాక్టర్‌లను పానుటూరు-రుగడ రోడ్డులో పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.పది వేలు చొప్పున అపరాధ రుసుం విధించారు. మరోసారి దొరికితే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని తెలిపారు. అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.



పానుటూరు- రుగడ రోడ్డులో పట్టుకున్న రెండు ఇసుక ట్రాక్టర్లు

తొలిరోజు 279 మంది గైర్హాజరు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 56 కేంద్రాల్లో జరుగుతున్న ఈ పరీక్షల్లో భాగంగా తొలిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ పేపర్లకు సెట్–3 ప్రశ్న పత్రాలతో విద్యార్థులు పరీక్షలు రాశారు. తొలిరోజు సోమవారం ఉదయం ఫస్టియర్ విద్యార్థులు జనరల్, ఒకేషనల్ కలిపి 3709 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 3507 మంది పరీక్ష రాశారు. 202 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం సెకెండియర్ విద్యార్థులు 783 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 706 మంది పరీక్షకు హాజరయ్యారు. 77 మంది డుమ్మాకొట్టారు. జిల్లా వ్యాప్తంగా సాయంత్రం ఈదురుగాలులతోపాటు ఆకాశం మేఘావృతమై ఉరుములు, పడుగులతో కూడిన వర్షం కురవడంతో పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ఆందోళన చెందారు. దీనికితోడు కరెంట్ పోవడంతో నానా అవస్థలు పడ్డారు. చిమ్మచీకట్లలోనే పరీక్షలు రాశారు.

గంజాయి అక్రమ రవాణాదారులకు పదేళ్ల జైలు



కాశీబుగ్గ: పలాస జీఆర్పీ రైల్వే స్టేషన్ పరిధిలో గంజాయి తరలించిన కేసులో ఇద్దరు యువకులకు పదేళ్లు జైలు శిక్ష, చెరో రూ.లక్ష జరిమానా విధిస్తూ ఫస్ట్ ఏడీజే కోర్టు జడ్జి పి.భాస్కరరావు సోమవారం తీర్పునిచ్చారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన అనంత సవర, రుణ కుండంగి ఇద్దరు వ్యక్తులు 82 కేజీల గంజాయిని తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన కేసు విచారణ పూర్తయి శిక్ష విధించినట్లు పలాస జీఆర్పీ ఎస్ఐ ఎస్కే షరీఫ్ తెలిపారు

అకాల వర్షాలతో ఇబ్బందులు



బూర్జ- కొల్లివలస గ్రామాల మధ్య రహదారిలో కూలిన చెట్లు తొలగిస్తున్న అధికారులు

బూర్జ: అకాల వర్షం, గాలి, మెరుపులతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రహదారి పాలకొండ-శ్రీకాకుళం, మదనాపురం-సరుబుజ్జిలి, బూర్జ-మామిడివలసతో పాటు పలు రహదారులపై చెట్లు కూలడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మామిడి తోటల్లో కాయలు రాలిపోవడంతో కౌలు రైతులు లబోదిబోమన్నారు. స్థానిక ఎస్ఐ ఎం.ప్రవల్లిక, ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు, తహసీల్దార్ వైవీ పద్మావతి, ఆర్టీసీ అధికారులు, అన్ని శాఖల సిబ్బంది సాయంతో కూలిన చెట్లను తొలగించారు.

● కొబ్బరి చెట్టుపై పిడుగు

జి.సిగడాం: మండలం ఎస్సీ ఆర్‌పురం గ్రామంలో ఐవీ అప్పారావు ఇంటి ఆవరణలో కొబ్బరి చెట్టుపై సోమవారం పిడుగు పడింది. మంటలు కూడా రేగడంతో ప్రజలంతా పరుగులు తీశారు.



● ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరాకు చర్యలు

అరసవల్లి: ఈదురుగాలులు, వర్షంతో జిల్లాలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లు చేసినట్లుగా విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి ప్రకటించారు. సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా భారీగా గాలులు వీయడంతో పాటు వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో కొంతమేరకు అంతరాయం ఏర్పడింది. వర్షం తగ్గాక వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టామని, అయితే అంతకుముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో ఇబ్బందులు లేవని ప్రకటించారు. భారీ ఫ్లెక్సీల వల్ల కొన్నిచోట్ల విద్యుత్‌లైన్లు తెగిపోయాయని, 33 కేవీ విద్యుత్ లైన్లలో సరఫరా నిలిచిపోకుండా చర్యలు చేపట్టామన్నారు. సోమవారం సాయంత్రం నుంచి టెక్నికల్ ఈఈ సురేష్‌కుమార్, శ్రీకాకుళం ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావు తదితర బృందం ఎక్కడికక్కడ వివరాలను సేకరించారు.



కొత్తరోడ్డులో 33 కేవీ లైన్లపై పడిన బ్యానర్లను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

సమస్యల ఏకరువు

- ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికకు 119 అర్జీలు
- సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశం


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

అర్జీలు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 119 అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరించిన వారిలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జెడ్పీ సీఈఓ ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజా ఉన్నారు.

పీజీఆర్ఎస్‌పై టెలీ కాన్ఫరెన్స్
పెండింగ్‌లో ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఎప్పటికప్పుడు అర్జీలపై సమీక్షించుకోవాలన్నారు. పీజీఆర్ఎస్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. అధికారులు ఇచ్చే సమాధానంతో అర్జీదారులు సంతృప్తి చెందాలన్నారు. అనంతరం వివిధ శాఖల వద్ద రెవెన్యూ భూముల సమస్యలపై జిల్లా కలెక్టర్ చర్చించారు. సమస్య ఉన్నదీ లేనిదీ తెలియజేయాలని ఆదేశించారు.

తప్పని తిప్పలు

ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక వద్దకు వచ్చే వారికి తిప్పలు తప్పడం లేదు. గత వారం ప్రజాఫిర్యాదుల విభాగానికి వచ్చిన ఓ వృద్ధురాలు పెట్రోలు పోసుకుని చనిపోతానని బెదిరించిన సంగతి అందరికి తెలిసిందే. దీంతో ఈ వారం కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ వారం ఓ దివ్యాంగురాలు వీల్‌చైర్‌లో స్పందన కార్యక్రమానికి వచ్చారు. ఆమె వస్తువులన్నీ తీసి తనిఖీ చేయడంతో.. వీల్‌చైర్ పైకి వెళ్లడానికి ఇబ్బంది పడ్డారు. కేజీబీవీ మురపాకలో ఇంటర్ సీటు కోసం ఇమె వచ్చారు. దివ్యాంగులు వెళ్లడానికి ర్యాంపు లాంటిది ఏర్పాటు చేస్తే బాగుంటుందని అక్కడ ఉన్న వారు అభిప్రాయపడ్డారు. అలాగే ప్రథమ చికిత్స వంటివాటికోసం స్టాఫ్ నర్సుల్ని ఏర్పాటుచేశారు. వారికి కనీసం ఓ చాంబర్, బల్ల వంటివి ఏర్పాటుచేయకపోవడంతో మెట్లపైనే కూర్చుని మందులు నేలపైనే పెట్టారు.

– శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)


వీల్ చైర్ ఎక్కేందుకు ఇబ్బంది పడుతున్న జాహ్నవి

ఎస్పీ గ్రీవెన్స్‌కు 61 వినతులు


గ్రీవెన్స్‌సెల్ ప్రాంగణంలో వృద్ధుల గోడు వింటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో (గ్రీవెన్సు) ప్రజల నుంచి 61 వినతులు అందాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వినతులు స్వీకరించిన అనంతరం ప్రజా ఫిర్యాదులు పెండింగ్ ఉంచరాదని అధికారులను ఆదేశించారు.

నిందితులను శిక్షించాలి
శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని జామియా మసీదులో ఇటీవల కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చందనం చెట్లను నరికి అక్రమంగా తరలించిన విషయం తెలిసిందే. దీనిపై మత పెద్దలు ఎం.ఎ.రఫీ, ఎం.ఏ.బేగ్ మరికొందరు సోమవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని కలసి సమగ్ర విచారణ చేపట్టి నిందితులను శిక్షించాలని కోరారు. 400 ఏళ్ల పైబడిన జామియా మసీదు శ్మశాన వాటికతో కలసి 17 ఎకరాల విస్తీర్ణంలో వృక్షసంపదతో నిండి ఉందని, 40 చందనపు మొక్కలు, చెట్లు ఉండేవని, వాటిలో కొన్నింటిని నరికేసి అక్రమంగా తరలించడంపై ఇప్పటికే ఒకటో పట్టణ సీఐ, ఎస్‌లకు వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు చేశామని అన్నారు.

బిల్లులిచ్చి ఆదుకోండయ్యా..

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తమకు ఇళ్ల బిల్లులు ఇచ్చి ఆదుకోవాలని శ్రీకాకుళం రూరల్ మండలం పెద్ద గనగళ్లవానిపేట మత్స్యకారులు విన్నవించారు. గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో 82 మందికి జగనన్న ఇళ్ల పట్టాలు అందించారు. అందులో 67 మంది వరకు పునాదులు వేసుకున్నారు. ఇంతలో ప్రభుత్వం మారిపోయింది. దీంతో ఇప్పటివరకు ఒక్క పైసా బిల్లు ఇవ్వలేదు సరికదా పట్టాలు సైతం రద్దు చేస్తామని ఆ గ్రామంలో టీడీపీ నాయకులు బెదిరిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక (స్పందన)లో కలెక్టర్‌కి గ్రామస్తులు విన్నవించుకున్నారు. అయితే కలెక్టర్ సైతం మీకు ఎవరు పునాదులు వెయ్యమన్నారు అనే సరికి ఆ గ్రామస్తులంతా ఒక్కసారి భయపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు మంజూరైతే ఈ ప్రభుత్వంలో నిర్మాణాలు చేపట్టిన వారికి బిల్లులు చెల్లించరా అని ప్రశ్నించారు. మత్స్యకారులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉలాల భారతీదివ్య, రౌతు శంకరరావు, మైలపల్లి పోలీసు కూడా పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల స్కీమ్ పెద్ద స్కామ్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రభుత్వ కుట్టు మిషన్ల స్కీమ్ పెద్ద స్కామ్ అని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఉలాల భారతీదివ్య అన్నారు. ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో సోమవారం పాల్గొని కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఉలాల భారతీదివ్య మాట్లాడుతూ పథకాల పేరిట కూటమి నేతలు జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు. అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్‌సీపీ పథకాలు అందజేసిందని, కూటమి ప్రభుత్వం కేవలం పచ్చ చొక్కాలకే పథకాలు అందిస్తోందని పేర్కొన్నారు. స్కామ్‌లపై దృష్టి సారించి ప్రజాధనం వృధా కాకుండా అర్హులైనవారికి పథకాలు అందేలా చూడాలని కోరారు. నరసన్నపేట నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, టి.కామేశ్వరి, పి.సుగుణారెడ్డి, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షులు రౌతు శంకరరావు తదితరులు పాల్గొన్నారు


కలెక్టర్‌ని వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళావిభాగం నాయకులు

కుమార్తె పుట్టిన రోజే

తండ్రికి ఆఖరి రోజు

- పుట్టిన రోజు వేడుకల్లో మిగిలిన భోజనాలు పంచేందుకు వెళ్తుండగా ప్రమాదం
- జేఆర్‌పురంలో విషాద ఛాయలు


హరీష్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం సమీపంలోని వరిసాం దగ్గర ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ముందు వెళ్తున్న లారీ అకస్మాత్తుగా ఆపడంతో వెనుక బైక్‌పై వెళ్తున్న బొద్దాన హరీష్‌రావు(25) లారీని ఢీకొట్టి గాయాలపాలై ఆస్పత్రిలో మృతిచెందాడు. కూతురి పుట్టిన రోజు వేడుకలు చేసుకుని మిగిలిన భోజనాలు రోడ్డు పక్కన ఉన్న వారికి ఇద్దామని వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. జేఆర్ పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. జేఆర్ పురం పంచాయతీ వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న హరీష్‌రావుకు అదే పంచాయతీలోని సీతంపేట గొల్లపేటలోని అమ్మాయితో పెళ్లయ్యింది. వీరికి నాలుగేళ్ల కూతురు ఉత్తర, ఆరు నెలల కుమారుడు రేవంత్ ఉన్నారు. ఆదివారం ఉత్తర పుట్టిన రోజు. దీంతో హరీష్‌రావు అత్తవారింట కుటుంబ సభ్యులతో కలిసి విందు చేసుకున్నాడు. తన బావమరిది పుట్టిన రోజు వేడుక కూడా చేసుకున్నాడు. ఈ రెండు కార్యక్రమాల్లో భోజనాలు మిగిలిపోవడంతో రోడ్డు పక్కన బిచ్చగాళ్లకు ఇద్దామని సీతంవలస అత్తవారి ఇంటి నుంచి ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో పైడిభీమవరం వరకు మూడు బైక్‌లపై తొమ్మిది మంది బయల్దేరారు. దారి పొడవునా కొందరికి ఇచ్చారు. తిరుగు ప్రయాణంలో రణస్థలం వైపు వస్తుండగా వరిసాం వద్ద ఆదివారం అర్ధరాత్రి 12.15 గంటల సమయంలో ముందు వెళ్తున్న లారీ సడెన్‌గా ఆపడంతో బైక్‌లు ఆ లారీని ఢీకొన్నాయి. హరీష్‌రావుకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావం కావడంతో.. స్నేహితులు బైక్‌పై రణస్థలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స అందించే సమయంలో మృతి చెందాడు. వెనుక కూర్చుని ఉన్న మరో ఇద్దరు కోరాడ దుర్గ, గొర్లె భాస్కరరావులకు తీవ్ర గాయాలకు కావడంతో 108లో శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.


హరీష్‌రావు (ఫైల్)

మృతుని భార్య ఉమ, తల్లి దమయంతి ఇంటిలోనే ఇండగా, తండ్రి అసిరయ్య రణస్థలం మండల కేంద్రంలో రిక్షా తొక్కుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుమార్తె పుట్టిన రోజు వేడుకలో మిగిలిన భోజనం పడేద్దామని కుటుంబ సభ్యులు చెప్పినా.. కాదని ఏవరో ఒకరికి ఇస్తే పుణ్యమని బయలుదేరి వెళ్లి ఇలా విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రమాదంపై మరో క్షతగాత్రుడు గొర్లె భాస్కరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆ 2 కిలోమీటర్లు..

- రణస్థలం, లావేరు మండలాల సరిహద్దులో అధికంగా రోడ్డు ప్రమాదాలు
- 24 గంటల్లో ఐదు ఘటనలు
- నెలలో కనీసం పది యాక్సిడెంట్లు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న స్థానికులు


ప్రమాదాలు జరిగే తాళ్లవలస, రావివలస మధ్య ప్రాంతం

రణస్థలం: లావేరు, రణస్థలం మండలాల సరిహద్దు ప్రాంతాలైన రావివలస, తాళ్లవలస గ్రామాల సమీపంలో రెండు కిలోమీటర్లు వాహన చోదకులను భయపెడుతున్నాయి. ఈ ప్రాంతంలో నెలకు కనీసం పది రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో వాహన చోదకులకు ఇది రెడ్‌జోన్ కింద మారింది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం అర్ధరాత్రి వరకు ప్రమాదాల తీరు చూస్తే ఈ రెండు కిలోమీటర్లు ఎందుకంత ప్రమాదకరమో అర్థమవుతుంది. ప్రమాదం జరిగిన వెంటనే లావేరు, రణస్థలం లేక హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని చకచకా క్షతగాత్రులకు సపర్యలు చేయడం లేదంటే మృతదేహాలను శవ పంచనామాలకు పంపించి కేసులు నమోదు చేసి మరిచిపోతున్నారు. కానీ ప్రమాదాలు నివారించేలా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

24 గంటల వ్యవధిలో..

- తాళ్లవలస దగ్గర శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు ద్విచక్రవాహనం వెళుతున్న యువకుడు జి. చిన్నబాబు అదుపుతప్పి శనివారం అర్ధరాత్రి గాయపడ్డాడు.
- తాళ్లవలస దగ్గర శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వస్తూ ఆటో బోల్తా పడి డ్రైవర్ ఆదివారం తీవ్రంగా గాయపడ్డాడు.
- రావివలస సమీపంలో ఆదివారం అర్ధరాత్రి 1.30 సమయం గ్రానైట్ లారీ ముందు వెళ్తున్న ఐరన్ లారీ ఢీకొట్టుకున్నాయి. వారు అక్కడే సెటిల్ చేసుకున్నారు.
- రావివలస సమీపంలో మొదట యాక్సిడెంట్ అయిన లారీని ఒక గంట తర్వాత మరో ఊక లారీ వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఊక లారీలో ఉన్న క్లీనర్ బెల్లంకొండ రమేష్ మృతి చెందాడు.
- రణస్థలం పాత పెట్రోల్ బంకు సమీపంలో విశాఖపట్నం ముందు వెళుతున్న లారీని వెనుక వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సదాశివం అనే అనే క్లీనర్‌కు ఒక కాలు పూర్తిగా నుజ్జునుజ్జు అయిపోయింది.
- అతివేగం, ఎక్కువ మలుపులు, లారీలు ఎక్కడ పడితే అక్కడ ఆపేయడం, హెచ్చరిక బోర్డులు లేకపోవడం ప్రమాదాలకు కారణమని స్థానికులు అంటున్నారు.



ప్రమాదంలో లారీ నుజ్జు నుజ్జు కావడంతో క్రేన్‌తో లాగుతున్న దృశ్యం

టెక్కలిలో కింజరాపు ట్యాక్స్

- మైనింగ్, లిక్కర్ వ్యాపారాల్లో కింజరాపు కుటుంబానికి పెద్ద ఎత్తున వాటాలు
- ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్


మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో కింజరాపు ట్యాక్స్‌తో పెద్ద ఎత్తున దోపిడీ పర్వం కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మండిపడ్డారు. సోమవారం టెక్కలిలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఎంతో పారదర్శకంగా ఏజెన్సీ వ్యవస్థతో ప్రభుత్వానికి ఆదాయం వచ్చేదని, ఇప్పుడు ఆ వ్యవస్థలను పక్కన పెట్టి విచ్చలవిడిగా కింజరాపు కుటుంబం మైనింగ్ దోపిడీ చేస్తోందని మండిపడ్డారు. టెక్కలి నియోజకవర్గంలో ఎలాంటి లీజు అనుమతులు లేకపోయినప్పటికీ అక్రమంగా కంకర తవ్వకాలు చేస్తున్నారని, దీనికి కింజరాపు ట్యాక్స్ కడితే చాలని తిలక్ దుయ్యబట్టారు. గోవిందపురం సమీపంలో సర్వే నంబర్ 71 లో వైఎస్సార్‌సీపీకి చెందిన మండపాక నర్సింగరావు అన్ని రకాల అనుమతులతో గ్రావెల్ క్వారీ నిర్వహిస్తుండగా, ఆ క్వారీలో మంత్రి అచ్చెన్నాయుడు, సోదరుడు హరిప్రసాద్ అక్రమంగా తవ్వకాలు చేసి కంకర తరలించేస్తున్నారని పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా చేస్తున్న గ్రావెల్ తరలింపు ఆపకపోతే వచ్చే సోమవారం గ్రావెల్ క్వారీను ముట్టడిస్తామని తిలక్ హెచ్చరించారు. టెక్కలి నియోజకవర్గంలో లిక్కర్ వ్యాపారానికి కింజరాపు ప్రసాద్, మైనింగ్ వ్యాపారానికి ఆయన కుమారుడు సురేష్ దాన్‌లుగా వ్యవహరిస్తూ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. టెక్కలి నియోజకవర్గం నుంచి ప్రభుత్వానికి వెళ్లాల్సిన ఆదాయం కింజరాపు కుటుంబానికి వెళ్తోందన్నారు. ఒక బీసీ వర్గానికి చెందిన మహిళా మాజీ మంత్రి విడుదల రజినిపై పోలీసుల ప్రవర్తన హేయమని తిలక్ మండిపడ్డారు.

దాతల సాయంతో ఆహారం, మజ్జిగ పంపిణీ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారులకు దాతల ద్వారా మజ్జిగ, భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరం ఆవరణలో సీఎంఆర్ వారు ఏర్పాటు చేసిన మజ్జిగ, భోజనాలను కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు అర్జీదారులకు అందజేశారు. ప్రతి వారం ఒక దాత ముందుకొచ్చి 150 లేదా 200 మందికి మజ్జిగ, భోజనాలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు.

‘సమస్యలు పరిష్కరించాలి’


మాట్లాడుతున్న యూటీఎఫ్ ప్రతినిధులు ఎస్.కిశోర్‌కుమార్, బమ్మిడి శ్రీరామ్మూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపతిరావు కిశోర్‌కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు అధ్యక్షతన సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్ మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కాని పక్షంలో ఈ నెల 15వ తేదీన డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన తమ ప్రధాన డిమాండ్లను వివరించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీ ప్రక్రియ చేపట్టాలని, ఉర్దూ మైనర్ మీడియం బోధించే ఉపాధ్యాయులను తెలుగు మీడియం ఎస్జిటి, ఎస్ఏలతో కలిపి లెక్కించి పోస్టులు కేటాయించడం సరికాదన్నారు. విద్యార్థుల సంఖ్య 75కు మించితే పీఎస్ హెచ్ఎం పోస్ట్ అదనంగా కేటాయించాలన్నారు. అనంతరం యూటీఎఫ్ సంఘ పెద్దలు డీఈఓ తిరుమల చైతన్యకు, జిల్లా పరిషత్ సీఈఓకు, జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రాలను అందజేశారు.

అవి వైఎస్సార్ సీపీ హయాంలో వచ్చిన నిధులు

- ఎమ్మెల్సీ రామారావు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

కంచిలి: ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధిలో ఇటీవల కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారని, ఈ పనుల నిధులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే వచ్చినవేనని ఎమ్మెల్సీ నర్తు రామారావు గుర్తు చేశారు. మండల కేంద్రం కంచిలిలో గల ఎమ్మెల్సీ కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోంపేట మండలం బారువ కొండిరేవ బ్రిడ్జికి రూ.3కోట్ల 45 లక్షలు, మహేంద్రతనయ బ్రిడ్జికి రూ.14 కోట్ల 60లక్షలు, ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు నుంచి పెద్దలక్ష్మీపురం వరకు రూ.4కోట్ల 86లక్షలు ప్రధాన మంత్రి సడక్‌యోజన కింద తారు రోడ్డు వేయడానికి, బూర్జపాడు ఉప్పుటేరుపై రూ.10కోట్ల 50లక్షలతో వంతెన నిర్మాణానికి ఆనాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన చేసి, టెండర్లు పిలిచి, ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆ పనులు తాత్కాలికంగా ఆగాయని అన్నారు. ఈ పనులు తామే తెచ్చామని కూటమి నాయకులు గొప్పగా చెప్పుకుంటున్నా.. నిజానికి ఆ ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీపీలు పైల దేవదాస్‌రెడ్డి, డాక్టర్ నిమ్మన దాస్, బోర పుష్ప, కంచిలి జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, పార్టీ నేతలు నర్తు నరేంద్రయాదవ్, ఇప్పిలి కృష్ణారావు, తడక జోగారావు, దుర్గాసి ధర్మారావు, నర్తు ప్రేమ్‌కుమార్, డొక్కరి బలరాం, మద్దు వెంకటరావు, కొత్తకోట శేఖర్, బల్లెడ సుమన్, గణప సింహాచలం, రాంపత్ని చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వారెంట్లు, సమన్ల అమలుపై దృష్టి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : కేసులో కోర్టువారు జారీ చేసిన నాన్ బెయిల్‌బుల్ వారెంట్లు, సమన్ల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఎస్పీ జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సమన్ల వివరాలు తెలుసుకునేందుకు ప్రతి పీఎస్‌లో ప్రోసెస్ రిజిస్టర్ నిర్వహణ సక్రమంగా ఉండాలని, వ్యక్తిగత వివరాలు, చిరునామా, ఇతర ఆధారాలు, సాంకేతికతను అనుసరించి ఎన్బీడబ్ల్యూదారులను గుర్తించి కోర్టులో హాజరుపర్చాలన్నారు. ముఖ్యంగా సంఖ్య తగ్గేలా చూడాలన్నారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ కె.వీరమణ, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సీఐ శ్రీను, ఎస్ఐ నేతాజీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

53 రోజుల ఆదాయం రూ.7.31 లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

పాతపట్నం: పాతపట్నంలో కొలువైన ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణిదుర్గ అమ్మవారి హుండీ ఆదాయం రూ.7,31,962లు వచ్చిందని ఆలయ ఈఓ టి.వాసుదేవరావు చెప్పారు. సహాయ కమిషనర్ కార్యాలయం దేవదాయ శాఖ అధికారి జీవీబీఎస్ రవి కుమార్ పర్యవేక్షణలో సోమవారం హుండీ ఆదాయం లెక్కింపు జరిగిందన్నారు. 53 రోజులగాను ఆదాయం వచ్చిందని చెప్పారు. లెక్కింపులో శ్రీవెంకటేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



సరుబుజ్జిలి: మండలంలోని పాలవలస గ్రామానికి చెందిన దాసరి అప్పన్న (47) సోమవారం చిగురువలస సమీపంలో పిడుగుపాటుకు మృతి చెందాడు. ఆయన రోజూలాగానే చిగురువలస పంచాయతీ పరిధిలోని తాడికొండ వద్ద గొర్రెల మందను నిలిపి ఉంచారు. ఈ సమయంలో వాతావరణంలో ఒక్కసారి మార్పులు ఏర్పడి ఈదురుగాలులు, వర్షం కురిసి పిడుగుపడింది. పిడుగు ప్రభావానికి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతునికి భార్య తులసమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జగన్నాథుని నిధులు కైంకర్యం

మందస: మందస మండలం సాబకోట గ్రామంలో జగన్నాథ స్వామి దేవాలయం నిధులు కైంకర్యం అయ్యాయని, దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ దేవస్థానం కోసం మందస రాజులు 25 ఎకరాలు ఇచ్చారని, 18 మంది రైతులు ఆ భూములు సాగు చేస్తూ శిస్తు చెల్లిస్తున్నారని, కానీ అధికారుల పర్యవేక్షణ లేక గుడి శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. కార్యనిర్వహణ అధికారి అవినీతికి పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. రికార్డుల్లో మాయ చేసి నిధులు కైంకర్య చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు జరపాలని కోరారు.

సాహితీవేత్త ‘పులఖండం’ కన్నుమూత


డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం సాహితీ రంగంలో ఎనలేని సేవలు అందించిన డాక్టర్ పులంఖండం శ్రీనివాసరావు సోమవారం గుండె పోటుతో మృతి చెందారు. వృత్తిపరంగా గాయత్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన సాహితీ రంగంలోనూ కృషి చేశారు. ముఖ్యంగా వ్యాఖ్యాతగా ఎన్నో కార్యక్రమాలను రమ్యంగా నిర్వహించారు. అష్టావధానం నిర్వహించడంలోనూ ప్రముఖ పాత్ర పోషించేవారు. శ్రీనివాసరావు విజయనగరం సంస్కృత కళాశాలలో విద్యనభ్యసించారు. ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు, బరంపురం యూనివర్సిటీలో ‘హరికథా వికాసం–ఉత్తరాంధ్రము’పై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. పులఖండం మృతిపై సుమిత్ర కళాసమితి అధ్యక్ష, కార్యదర్శులు ఇప్పిలి శంకరశర్మ, గుత్తి చిన్నారావు, నక్కశంకరరావు, మండవిల్లి రవి, కిల్లాన ఫల్గుణరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న, ఉపనిషన్మందిరం అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మానగేష్, కామేశ్వరరరావు, జంధ్యాల శరత్‌బాబు, నిష్టల నర్సింహమూర్తి, విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు తదితరులు సంతాపం ప్రకటించారు.

ఆయన నేత్రాలు సజీవం


కింతలి చిట్టిబాబు

టెక్కలి: టెక్కలి చిన్నబజారుకు చెందిన వ్యాపారి కింతలి చిట్టిబాబు సోమవారం మృతి చెందడంతో, ఆయన కుటుంబ సభ్యులు చిట్టిబాబు నేత్రాలను దానం చేసేందుకు నిర్ణయించారు. ఈ మేరకు కుమారులు తిరుమలకుమార్, సురేష్‌కుమార్, అల్లుడు నేతాజీ గుప్తా తదితరులు పట్టణంలో అభయం యువజన సేవా సంఘానికి సమాచారం అందజేశారు. వారు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావుకు సమాచారం ఇవ్వడంతో, మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం నుంచి వైద్య బృందం టెక్కలికి చేరుకుని చిట్టిబాబు నేత్రాల నుంచి కార్నియాలను సేకరించారు.

మద్యం తాగి వాహనం నడిపినందుకు 30 రోజులు జైలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఏడురోడ్ల కూడలిలో ఈనెల 9న మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి సోమవారం కోర్టు 30 రోజులు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ నాగరాజు వెల్లడించారు. పోలాకి మండలానికి చెందిన ఇర్రి శ్రీను ఈనెల 9న మధ్యాహ్నం 2.05 గంటలకు ఏడురోడ్ల కూడలిలో ట్రాఫిక్ పోలీసులకు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించిన ట్రాఫిక్ పోలీసులు శ్రీనుపై కేసు నమోదు చేశారు. ఫలానాయే కదా.. కట్టేయొచ్చనుకుని కోర్టుకు వెళ్లిన శ్రీనుకు న్యాయమూర్తి 30 రోజుల జైలు శిక్ష విధించారు.